# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక






సంపుటి : 01 | సంచిక : 108 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 17 మార్చి 2026 | పేజీలు : 4




## ప్రజలకు మెరుగైన వైద్యం అందాలి

- పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి
- మెనూ ప్రకారమే భోజనం
- టెన్త్ విద్యార్థులకు మాథ్స్ బోధించిన కలెక్టర్
- విద్యార్థులు కష్టపడి చదవాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా


2




# మార్చి 31 వరకు తెలంగాణ అసెంబ్లీ

- 20న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి
- ఉగాది, రంజాన్, శ్రీరామ నవమికి సెలవులు
- బీఏసీ సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 31 వరకు జరగనున్నాయి. ఈ మేరకు బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షత బీఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్చి 16 నుంచి మార్చి 31 వరకు సమావేశాలను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. సోమవారం ఉదయం గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ సభను మంగళవారం వాయిదా వేశారు. అనంతరం స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించారు. మార్చి 17, 18న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఈనెల 20న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెను ప్రవేశ పెట్టనుంది. ఆపై 23 నుంచి 26 వరకు బడ్జెట్ పై చర్చలు జరపనున్నారు. మార్చి 31న ద్రవ్య వినిమియ బిల్లుపై చర్చ జరగనుంది. అలాగే ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి అసెంబ్లీకి సెలవులు ప్రకటించనున్నారు. బీఏసీ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. బీఆరఎస్ నుంచి హరీశ్ రావు, కేపీ వివేక్ హాజరవగా.. బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు.




# wanted

## విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way



# ప్రజలకు మెరుగైన వైద్యం అందాలి

- పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి
- మెనూ ప్రకారమే భోజనం
- టెన్త్ విద్యార్థులకు మాథ్స్ భోధించిన కలెక్టర్
- విద్యార్థులు కష్ట పడి చదవాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం అందించాలని జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. సోమవారం ఆయన నర్మెటలోని పీహెచ్సీ, కేజీబీవీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీహెచ్‌సీ పరిసరాలను ముందుగా పరిశీలించి పలు సూచనలిచ్చారు. మందుల నిల్వ లను అలాగే వాటి మీద ఉన్న ఎక్స్పైరీ డేట్ ని పరిశీలించారు. వైద్యానికి సరిపడా మందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.. సరిపడ మందులను, వ్యాక్సిన్ లను అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. అనంతరం కేజీబీవీని సందర్శించి చుట్టూ పరిసరాలలో పెరిగే పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. వంట సరుకుల నాణ్యతను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజన తయారీని కూడా క్షుణ్ణంగా చూసి జాగ్రత్తగా చేయాలని, ఎప్పటికప్పుడు వంట చేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలని, మెనూను తప్పకుండా పాటించాలని కలెక్టర్ సూచించారు. పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న 10వ తరగతి విద్యార్థులకు మాథ్స్ సబ్జెక్ట్ లోని పలు అంశాలను కలెక్టర్ స్వయంగా నేర్పించి వాటి మీద విద్యార్థులకు ఉన్న సామర్థ్యాన్ని పరిశీంచారు.

# ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా 224 ఆర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణిలో ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన వివిధ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదే విధంగా వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఇందులో కొన్ని దరఖాస్తులు ఇలా ఉన్నాయి.



పాలకుర్తి మండలం, విస్నూర్ గ్రామానికి చెందిన బి. వసంత, గత 12 సంవత్సరాలుగా జగిత్యాల జిల్లా పొలాస గ్రామంలో జీవనం సాగిస్తున్నారని, గుంట పావు భూమి కూడా ఇక్కడే కలదని, అయితే ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు కోసం జనగామ జిల్లా పరిధిలో దరఖాస్తు చేసినారని, కావున తన ప్రజాపాలన దరఖాస్తును జనగామ జిల్లా నుంచి జగిత్యాల జిల్లా పొలాస రూరల్ కు బదిలీ చేయాలని విన్నవిస్తూ దరఖాస్తు చేసియున్నారు.

తరిగొప్పుల మండలం, ఎన్యా నాయక్ తండాకు చెందిన ఎం. నిర్మల, తనకు గల ఒక గుంట భూమి పట్టా పాస్ బుక్ లాక్ అయిందని, ఆర్డీఓ లాగిన్ లో ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.



లింగాల ఘనపురం మండలం, వడ్డిచర్ల గ్రామానికి చెందిన రమాదేవి, తనకు సొంత ఇల్లు, సొంత స్థలం ఏమీ లేదు అని, అద్దెకు ఉంటున్నాను అని, గతంలో ఇందిరమ్మ ఇల్లు కొరకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాను అని, తెల్ల ఆహార భద్రత కార్డు కలదని, కావున తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, నివాసం కల్పించగలరని వేడుకుంటూ దరఖాస్తు చేసుకున్నారు.

జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీ, 12వ వార్డుకు చెందిన పెంట సోమలక్ష్మి, గత ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నారని, తమకు ఎటువంటి ఇల్లు, ఖాళీ స్థలం లేదని, డబుల్ బెడ్ రూం ఇల్లు ఇప్పించుట కోసం ఆర్జీ ద్వారా కోరారు.

జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్ కు చెందిన గౌరోజు సదాశివరావు, హైదరాబాదు రోడ్డులో గల ఏకశిల కళాశాల పక్కన తనకు ప్లాటు కలదని, ఆ ప్లాటు కెనాల్ కాలువలో పోయిందని, ఈ విషయమై తనకు నష్ట పరిహారం ఇప్పించుట గురించి వినతిపత్రం సమర్పించనైనది.

ఈ ప్రజావాణిలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డీఆర్‌డీఓ వసంత, డీపీఓ అంబికా సోనీ, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఉజ్జయినీ విక్రమోత్సవంలో జనగామ సిద్ధాంతి

**జనగామ, మన చౌరాస్తా :** ఉజ్జయినీ నగరంలో మహర్షి పాణి ని వేద విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మార్చి 13, 14, 15వ తేదీల్లో నిర్వహించిన విక్రమోత్సవం 2026 లో జనగామ శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రధాన అర్చకులు, శ్రీ శ్రీ శ్రీ చినజీయర్ స్వామి ఆస్థాన సిద్ధాంతి తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి విశిష్ఠ అతిథీ గా పాల్గొని ప్రసంగించారు. ఈ వేదపండితుల సమ్మేళనంలో వీరితో పాటు విశ్వ విద్యాలయం కులపతి ఆచార్య శివశంకర్ మిశ్రా, జ్యోతిష్య శాస్త్రం విభాగాధిపతి. డా. ఉపేంద్ర భార్గవ్, తిరుపతి విశ్వ విద్యాలయం జ్యోతిష్య శాస్త్ర విభాధిపతి కృష్ణేశ్వర ఝా, రష్యా నుంచి వచ్చిన ప్రొఫెసర్ కుచుక్ మహోదయ, డిల్లీ విశ్వ విద్యాలయం జ్యోతిష్య శాస్త్రం విభాగాధిపతి రవీంద్ర త్రిపాఠి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సమ్మేళనంలో ఆధునిక కాలంలో జ్యోతిష్య శాస్త్రం ప్రభావం, పంచాంగ గణాంకాలు, సమాజంపై వాటి ప్రభావం, ప్రాభవం గురించి చర్చించినట్లు సిద్ధాంతి తెలిపారు. ఉజ్జయిని పండితులు చూపిన ఆదరణ ఆప్యాయతలు తనను ముగ్ధుణ్ణి చేశాయని అన్నారు. జనగామ సిద్ధాంతి కి ఉజ్జయినిలో సన్మానం జరగడం పట్ల పట్టణవాసులు అనేకమంది అభిమానులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.




# ఘనంగా 'అంతః ప్రేరణ' 7వ ఎడిషన్

**సైనిక్‌పురి, మన చౌరాస్తా :** సైనిక్ పురి భవన్స్ వివేకానంద కళాశాలలోని ఎంట్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బిజినెస్ ప్లాన్ పోటీ 'అంతః ప్రేరణ' 7వ ఎడిషన్ అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ పోటీలో భారతదేశంలోని 11 రాష్ట్రాల నుండే కాకుండా, యూకే, యూఎస్, కెనడా వంటి దేశాల నుండి మొత్తం 102 బృందాలు పాల్గొన్నాయి. ప్రారంభోత్సవానికి విచ్చేసిన గ్రూప్ కెప్టెన్ డి.రమణయ్య మాట్లాడుతూ విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేయాలని, సమాజ హితం కోసం వ్యాపారవేత్తలుగా ఎదగాలని కోరారు. తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ సీఈఓ మిస్టర్ మెరాజ్ ఫహీమ్, మిస్టర్ అక్షయ్ సి.ఎస్. దేశ్‌పాండేలు ముఖ్య అతిథులుగా పాల్గొని తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. తిర్మల్ రావు, ఈ కార్యక్రమ ప్రాముఖ్యతను విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంలో ఈ వేదిక ఎలా ఉపయోగపడుతుందో వివరించారు.

# గ్రామ పంచాయతీ సిబ్బందికి సన్మానం

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చౌడారం గ్రామంలోని గ్రామపంచాయతీ సిబ్బంది చేసిన సేవలను గుర్తించి మంగళవారం వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ యాసారపు ప్రవీణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ దూడల సిద్దయ్య గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కొమలత, వార్డు సభ్యులు దూడల నాగయ్య, పర్శరములు, జగదీశ్వరి, యాకూబ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# కాలం ఉన్నంతవరకు కలం జ్ఞాపకాలు చెరిగిపోవు

■ **తాడూరి కరుణాకర్**



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** పాత్రికేయ రంగంలో 25 సంవత్సరాల పాటు సేవలందించి ఆదర్శంగా నిలిచిన సీనియర్ రిపోర్టర్ ఏవీ రమణారెడ్డి సేవలు ఎప్పటికీ మర్చిపోలేనివని వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాడూరి కరుణాకర్ అన్నారు. కాలం ఉన్నంతవరకు కలం జ్ఞాపకాలు చెరిగిపోవని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రుల ఆధ్వర్యంలో రమణారెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తాడూరి కరుణాకర్ మాట్లాడుతూ గత 25 ఏళ్లలో పాత్రికేయ రంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని తెలిపారు. ప్రకటనలు, సర్కులేషన్, వార్తా సేకరణ వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటూ జర్నలిస్టుగా కొనసాగడం అనేది గొప్ప అనుభవాలను, పాఠాలను నేర్పుతుందని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ మాట్లాడుతూ ప్రజలకు సమాచారం చేరవేసే బాధ్యతను పాత్రికేయులు నిబద్ధతతో నిర్వర్తిస్తారని అన్నారు. అధికారులతో, రాజకీయ నాయకులతో, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ మారుతున్న కాలానికి అనుగుణంగా పాత్రికేయ వృత్తిని కొనసాగించడం గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. సీనియర్ పాత్రికేయుడు రాష్ట్ర నాయకుడు పీవీ మదన్ మోహన్ మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాల కింద ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమం కోసం యూనియన్ ఏర్పాటుకు భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోనే పునాది పడిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ సమాజానికి దిక్సూచిగా నిలిచే పాత్రికేయులు ఐక్యంగా ఉంటేనే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం రమణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాబోయే రోజుల్లో రమణారెడ్డి కుటుంబానికి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ మండల చైర్మన్ దేగల సారయ్య, ఎల్కదుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సలహాదారు ఏరుకొండ నరసింహస్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోలుగురి రాజు, ఆదరి రవీందర్, బిజెపి జిల్లా నాయకుడు పైడిపల్లి పృథ్వీరాజ్, మండల అధ్యక్షుడు రామోజు శ్రీను, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మండల సురేందర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు రేణిగుంట్ల బిక్షపతి, సీనియర్ పాత్రికేయులు అజయ్, రిటైర్డ్ ఈవో సుదర్శన్ రెడ్డి, ముల్కనూర్, వంగర ఎస్ఐలు రాజు, దివ్య, మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



# కలెక్టర్‌పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు

**జనగామ, మన చౌరాస్తా :-** జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీఆర్డీఏ పీడీ వసంత, మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారులపై ఎస్సీ ఎస్టీ నిరోధక చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్, అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఇర్రి అహల్య కోరారు. ఈ మేరకు సోమవారం జనగామ సీఐ సత్యనారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయం ముందు వనిత టీ స్టాల్ యజమాని పాలమాకుల మంజుల డబ్బాను తొలగిస్తూ కలెక్టర్ అదే రకంగా మున్సిపల్ అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. తను ఒక వ్యాపారాన్ని పెట్టుకొని గౌరవంగా బతకాలని చూస్తున్న తరుణంలో తన షాపును నడవకుండా చేసి తన మనోభావాల్ని గాయపరిచారని ఆర్థికంగా నష్టపరిచారని, సామాజికంగా అగౌరవానికి గురి చేశారని అందుకోసం కలెక్టర్ పైన ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విజయ మిల్క్ పార్లర్ యజమాని పుత్కనూరి విజయలక్ష్మి కూడా తనను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన స్టాల్ ను తొలగించి తన సమానులన్నీ చిందరవందర చేసి తనను ఇబ్బందుల పాలు ఆర్థికంగా నష్టం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కమిటీ సభ్యులు బొట్ల శ్రావణ్, మహిళా సంఘం నాయకురాలు కొండ వరలక్ష్మి, పాలమాకుల కనకయ్య తదితరులు ఉన్నారు.

# పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

**హనుమకొండ, మన చౌరాస్తా :** ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రావలసిన 5 నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) పరకాల సూపరింటెండెంట్ విష్ణుమూర్తి, డాక్టర్.ఎం.గౌతమ్ చౌహాన్‌ను వైద్యాధికారి డాక్టర్.వి.శ్రీనాథ్ కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనాలు నెలల తరబడి రావడం లేదని ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేతనాలు ఆలస్యమవడంతో ఉద్యోగులు ఇంటి కిరాయి, కరెంట్ బిల్లులు, పాల బిల్లులు, పిల్లల విద్యా ఫీజులు, ఈ.ఎం.ఐ.లు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మరియు జనవరి నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ లోపు పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే, 17 మార్చి 2026 లంచ్ సమయంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ ఎస్.ప్రమీల, ల్యాబ్ టెక్నీషియన్ ఎం.ప్రశాంత్, డాటా ఎంట్రీ ఆపరేటర్ చల్ల రోజా, ల్యాబ్ అటెండర్ కే. రమేష్ తదితరులు పాల్గొన్నారు..






# అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** అంగన్వాడీలకు కనీస వేతనం 18000 ఇవ్వాలని ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంగా అంగన్వాడీలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఉద్యమాలను ఆపలేరని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) కొడకండ్ల ప్రాజెక్టు అధ్యక్షురాలు పెంతల భిక్షం అన్నారు. సోమవారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో అంగన్వాడీలను అక్రమ అరెస్టులను ఖండించారు. అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ కు 18 వేల రూపాయలు పెంచుతామని, పిఎఫ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి నేటికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో వై ఉపేంద్ర, బి శ్రావణి, బి నాగమణి, ఏం కోమల, ఏం స్వర్ణలత, కే అనిత, రంగమ్మ, పోలమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో సివిల్ సప్లై అధికారుల దాడులు



**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో పలు అల్పాహార కేంద్రాలు, భోజనశాల హోటళ్లపై సివిల్ సప్లై అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 4 డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేసినట్టు సివిల్ సప్లై అధికారి లచ్చు నాయక్ తెలిపారు. డొమెస్టిక్ సిలిండర్ లను గృహ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని, కమర్షియల్ గా ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. తమ పర్యవేక్షణ, నిఘా నిరంతరం కొనసాగుతుందన్నారు.




# ఆకస్మిక తనిఖీలు చేసిన అదనపు కలెక్టర్

**జనగామ, మన చౌరాస్తా :** అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ జనగాంలోని ప్రభుత్వ SCDD బాయ్స్ హాస్టల్, TMRJC బాయ్స్ హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. కిచెన్ , స్టాక్ రిజిస్టర్లు, స్టాఫ్ అటెండన్స్ రిజిస్టర్ లను ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్ నిర్వహణ, భోజన తయారీ , స్టాఫ్ అటెండెన్స్ పై సంబంధిత ప్రిన్సిపాల్, వార్డెన్లకు పలు సూచనలు చేశారు.




# సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

- కరోనా కష్టాలపై రాసిన అనిమేషకు గాను అవార్డు ప్రకటన
- సిధారెడ్డికి అవార్డుపై సాహితీవేత్తలు,కేసీఆర్, కేటీఆర్ హర్షం



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** తెలంగాణ కవి, రచయిత నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2025 లభించింది. ఆయన కవితా సంపుటి 'అనిమేష' లో కరోనా కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను హృద్యంగా చిత్రీకరించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్‌గా, మంజీరా రచయితల సంఘం ద్వారా తెలుగు సాహిత్యానికి కొత్త ఊపునిచ్చి, తెలంగాణ ఉద్యమానికి తన కవిత్వం ద్వారా గొప్ప సహకారానిచ్చిన ఆయన తెలంగాణ సాహిత్యానికి గర్వకారణం. నందిని సిధారెడ్డి తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్‌గా పనిచేశారు. తన కలం ద్వారా తెలంగాణ సంస్కృతి, ఆత్మ, జీవన విధానాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణ సాహిత్యానికి అగ్రగామిగా నిలిచారు. ఆయన రచనలు కేవలం కవిత్వం మాత్రమే కాక, తెలంగాణ జీవితం, ప్రజల సమస్యలు, ఉద్యమం వంటి అంశాలను స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. మెదక్ జిల్లా కేంద్రంగా 'మంజీరా రచయితల సంఘం' స్థాపించి, ఎందరో వర్ధమాన కవులను, రచయితలను ప్రోత్సహించారు. సాహిత్యానికి ప్రాంతీయతను అద్దడంలో ఆయనది ప్రత్యేక శైలి. ఈ సంఘం ద్వారా తెలుగు సాహిత్యంలో నూతనవాణి, విభిన్న అభివ్యక్తులు, సామాజిక చైతన్యానికి వేదికైంది. ఈ సంఘం తెలుగు సాహిత్యానికి కొత్త వన్నె తెచ్చి, యువ రచయితలకు ప్రేరణనిస్తూ, తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను, ఆవశ్యకతను తన సృజనాత్మక రచనల ద్వారా చాటుతూ తెలంగాణ ఉద్యమానికి గొప్ప ఊపునిచ్చింది. ఈ అవార్డు తెచ్చిపెట్టిన 'అనిమేష' కవితా సంపుటి కేవలం అక్షరాల కూర్పు కాదు అది ఒక కాలానికి దర్పణం. ప్రపంచాన్ని వణికించిన కరోనా కాలంలోని సామాజిక పరిస్థితులు, మానవ సంబంధాలు, వలస కూలీల కష్టాలు, ఒంటరితనాన్ని ఈ సంపుటిలో కళ్లకు కట్టారు. 'అనిమేష'లో కరోనా సమయంలో ప్రపంచం ఎదుర్కొన్న సామాజిక, ఆర్థిక, మానవ సంబంధ సమస్యలను నందిని సిధారెడ్డి హృద్యంగా చిత్రీకరించారు. మానవ సంబంధాల విచ్ఛిన్నత, సమాజంలో ఒంటరితనం, ఆందోళన, సామాజిక కలతలను ప్రతిబింబింపజేసే నందిని సిధారెడ్డి కవిత్వం పాఠకులకు ప్రేరణగా నిలుస్తోంది.




'నాగేటి సాల్లళ్ల నా తెలంగాణ' వంటి పాటల ద్వారా తెలంగాణ పల్లె జీవనాన్ని, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన పాటలు ప్రజలను ఉర్రూతలూగించడమే కాకుండా, స్వరాష్ట్ర ఆకాంక్షను బలోపేతం చేశాయి. తెలంగాణ స్వతంత్ర రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో నందిని సిధారెడ్డి పాటలు, కవిత్వం ద్వారా ప్రజలను ఆలోచింపజేశారు. ఆయన రచనలు రాష్ట్ర ఉద్యమానికి ఉత్సాహాన్ని నింపాయి. ప్రజల సమస్యలను కవిత్వం ద్వారా తెలియజేయడం, ఉద్యమ కవిగా ప్రజల అభిమానాన్ని పొందడం ఈ విధంగా తెలంగాణ ఉద్యమంలో నందిని సిధారెడ్డి కీలక పాత్ర పోషించారు. నందిని సిధారెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందడం తెలంగాణ సాహిత్యానికి, సమాజానికి, సాంస్కృతికంగా గర్వకారణమని సాహితీ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. ఆయన కృషి, తెలుగు సాహిత్యానికి చేసిన విశిష్టమైన సేవలు గుర్తింపుగా నిలిచాయి. తెలంగాణ ఆత్మ, జీవితం, సంస్కృతిని ప్రపంచానికి చాటిన రచయితగా నందిని సిధారెడ్డి ప్రత్యేక స్థానాన్ని సంపాదించారని సాహితీ లోకం తెలిపింది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత, భాషా సాహిత్యాల వికాసం కోసం ఏర్పాటు చేసిన తెలంగాణ సాహిత్య అకాడమీకి తొలి చైర్మన్‌గా నందిని సిధారెడ్డి సేవలు అందించారు. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు అనేక పుస్తకాలను ఆయన వెలుగులోకి తెచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా అందించే, అత్యున్నత 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు '2025 ' ఈసారి ప్రముఖ తెలంగాణ కవి, రచయిత, నందిని సిద్దారెడ్డి కి దక్కడం పట్ల బీఆరఎస్ అధినేత కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నందిని సిద్దారెడ్డిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

కరోనా సందర్భంగా ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాన్ని, ముఖ్యంగా మానవ సంబంధాల విచ్ఛిన్నతలను కవిత్వం ద్వారా హృద్యంగా చిత్రీకరించిన, దీర్ఘ కవితా సంపుటి 'అనిమేష'కు ఈ అవార్డు రావడం గొప్ప విషయమని అన్నారు. తెలంగాణ మట్టివాసన తెలిసిన కవిగా, తన సాహిత్యం ద్వారా తెలంగాణ జీవితాన్ని అక్షరబద్ధం చేసిన తెలంగాణ గర్వించదగ్గ కవి, నందిని సిధారెడ్డి అని కొనియాడారు.

మెదక్ జిల్లా కేంద్రంగా మంజీరా రచయితల సంఘం ఏర్పాటుచేసి, అన్ని వర్గాల ప్రజా సమస్యలు, సామాజిక సమానత్వం కోసం రచనలు చేస్తూ తమ కలాన్ని, గళాన్ని విప్పారని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో తన పాట, సాహిత్యం ద్వారా ప్రజలను ఆలోచింపజేస్తూ, ఉద్యమ కవిగా తెలంగాణ ప్రజల అభిమానాన్ని సిధారెడ్డి చూరగొన్నారని పేర్కొన్నారు. ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం పట్ల బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అత్యున్నత పురస్కారం లభించడం యావత్ తెలంగాణకే గర్వకారణమని ఆయన కొనియాడారు.

ఈ సందర్భంగా సిధారెడ్డికి తన తరఫున , పార్టీ తరఫున మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. నందిని సిధారెడ్డి ఆధునిక తెలుగు కవిత్వంలో ఎన్నో పరిశోధనలు చేసి, తన అమూల్యమైన రచనలతో తెలుగు సాహితీ రంగానికి విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. మంజీరా రచయితల సంఘం స్థాపించి తెలుగు సాహిత్యానికే వన్నె తెచ్చిన ఆయన కృషి మరువలేనిదన్నారు. ముఖ్యంగా తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను, ఆవశ్యకతను తన శక్తివంతమైన పాటలతో చాటుతూ, తెలంగాణ ఉద్యమానికి ఒక గొప్ప ఊపునిచ్చిన ప్రజా కవిగా ఆయనను అభివర్ణించారు. సాహిత్య రంగంలో అత్యున్నత పురస్కారమైన కేంద్ర సాహిత్య అకాడవమీ అవార్డును సిధారెడ్డి గెలుచుకోవడం వారి సాహిత్య ప్రస్థానానికి దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని తన కలం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పిన ఆయనకు ఈ పురస్కారం దక్కడం సముచితమని అన్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**